సాక్షి
సిద్దిపేట
శనివారం । 6 । జనవరి । 2024



'మిత్తి' మీరుతున్నారు..
జిల్లాలో వడ్డీ వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎదుటి వారి అవసరాలు, పేద ప్రజల కష్టాలు ఆసరాగా చేసుకొని రెచ్చిపోతున్నారు. వివరాలు 8లో ▸



దొంగల బీభత్సం
హుస్నాబాద్, అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో శుక్రవారం దొంగలు బీభత్సం సృష్టించారు.
వివరాలు 8లో ▸



లాభాల పుదీన
కొద్దిపాటి స్థలం, నీటి వసతి కలిగి ఉంటే చాలు పుదీన సాగు రైతులకు లాభసాటిగా మారుతుంది.
వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

నీటిని పొదుపుగా వాడుకోవాలి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజా

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజా పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్నకోడూరు రైతు వేదికలో భూగర్భ జలవనరుల పెంపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు. మండలంలో ఇప్పటికే చెక్ డ్యామ్‌లు, నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టామన్నారు. వర్షపు నీరు భూమిలో ఇంకే విధంగా ఉపాధి హామీ పథకంలో ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్ వంటివి నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర భూగర్భ జలబోర్డు రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి, సీనియర్ సైంటిస్టులు సుధీర్ కుమార్, రాణి, మాధవ్, డీకే మొహంత, వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి నూరొద్దీన్, ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, మండల వ్యవసాయ అధికారి జయంత్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌పై త్వరలో అవిశ్వాస తీర్మానం

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజులపై త్వరలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ చెప్పారు. సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల భర్త, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన విధానాలు నచ్చకపోవడంతోనే పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై రహస్యంగా సమావేశాలు జరుపుతున్నారన్నారు. 43 వార్డులకు గాను 20 మంది వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. వారు త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్నారు. ఆయన వెంట జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజార్ మాలిక్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశద్, నరహరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



కబ్జా స్థలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి స్థలంతో పాటు దేవాదుల కాల్వ స్థలం కబ్జాకు గురైందని, ఆ స్థలాలను వెంటనే సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద చెరువు మత్తడి, దేవాదుల కాల్వ స్థలాలను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంత ఎమ్మెల్యేలుగా పనిచేసిన ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పెద్దచెరువును, మత్తడి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దేవాదుల కాల్వ భూములు కబ్జా చేయడం దారుణమన్నారు. కబ్జాలకు పాల్పడిన వారికి వ్యతిరేకంగా చేస్తున్న తమ పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చెట్టిపల్లి సత్తిరెడ్డి, రాంసాగర్ సర్పంచ్ రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో, ఆలేటి యాదగిరి, బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, రాళ్లబండి నాగరాజు, తేలు ఇస్తారి, శ్రీహరి, ఇప్పకాయాల శోభ, మల్లేశం, ప్రభాకర్, సాయిలు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రూప్–1, 2, 3, 4 పోటీ పరీక్షలకు ఉచితంగా బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ అందించనున్నట్లు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణదయాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు స్టడీ సర్కిల్ (08457–224941, 99666 73095)లో సంప్రదించాలని కోరారు.

3,36,267 దరఖాస్తులు

నేటితో ప్రజాపాలన ముగింపు

- గత నెల 28న ప్రారంభమైన కార్యక్రమం
- ఇప్పటి వరకు 3.36 లక్షల అర్జీలు
- 5 గ్యారంటీలకు 2.88 లక్షలు
- ఆన్‌లైన్ నమోదుకు 552 మంది ఆపరేటర్లు

జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు

తేదీ	గ్రామాల్లో	పట్టణాల్లో	మొత్తం
డిసెంబర్ 28	16,032	5,004	21,036
డిసెంబర్ 29	31,280	11,529	42,809
డిసెంబర్ 30	41,239	10,519	51,758
జనవరి 2	47,479	9,348	56,827
జనవరి 3	38,394	7,148	45,542
జనవరి 4	35,127	6,058	41,185
జనవరి 5	23,222	5,885	29,107



ఇబ్రహీం నగర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

సాక్షి, సిద్దిపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరు గ్యారంటీల పథకాలను అమలు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ డిసెంబర్ 28న ప్రారంభమైంది. శనివారంతో ఈ దరఖాస్తుల స్వీకరణ ముగియనుంది. శుక్రవారం వరకు మొత్తం 3,36,267 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పోర్టల్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్‌లను నియమించి వారికి శిక్షణ ఇచ్చారు.

ఒకే దరఖాస్తు.. ఐదు గ్యారంటీలు..

మహాలక్ష్మి (మహిళలకు నెలకు రూ 2,500 నగదు బదిలీ), రైతు భరోసా(ఎకరానికి ఏడాదికి రూ.15వేలు, కౌలు రైతుకు సాయం), గృహజ్యోతి పథకం(రూ 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్‌ల లోపు ఉచిత విద్యుత్), ఇందిరమ్మ ఇళ్లు (అర్హులు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు, తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు ఇంటి స్థలం), చేయూత పథకం(నెలకు రూ.4వేలు పింఛన్)ల కోసం ఒకే దరఖాస్తు ద్వారా అధికారులు స్వీకరించారు. ప్రభుత్వమే ఉచితంగా ప్రజా పాలన దరఖాస్తులను అందజేశారు. గ్రామాలు, వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా షెడ్యూల్ ప్రకారం స్వీకరించారు.

ఇప్పటి వరకు 2.88లక్షల దరఖాస్తులు

ఉదయం 8 గంటల నుంచి 12 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం అమలుచేసే గ్యారంటీల కోసం 489 గ్రామాలు, 115 మున్సిపల్ వార్డుల్లో ఇప్పటి వరకు 2,88,264 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఐదు గ్యారంటీలు కాకుండా గ్రామాల్లో 39,108, పట్టణాల్లో 8,895 మంది దరఖాస్తులను అందజేశారు. మొత్తంగా 48,003 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఎక్కువ శాతం రేషన్ కార్డుల కోసం చేసినట్లు తెలిసింది.

పోర్టల్‌లో నమోదు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో దరఖాస్తులను ఎంట్రీ చేయనున్నారు. ఇందుకోసం 26 మండలాలకు మాస్టర్ ట్రైనర్‌లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 552 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. వారు శనివారం నుంచి దరఖాస్తుల దారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. ఈ నెల 18 నాటికి డేటా ఎంట్రీ పూర్తి చేయనున్నారు.

మల్లన్న కల్యాణానికి చకచకా ఏర్పాట్లు

ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో శ్రీమల్లికార్జున స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు అధికారులు చకచకా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం ఆదివారం ఉదయం 10.45 గంటలకు అంగరంగ వైభవంగా జరగనుంది. వీర శైవ ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారం ఉజ్జయిని పీఠాధిపతి 1008 సిదలింగరాజదేశి కేంద్ర శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో ఈ కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణ ఏర్పాట్లను జనగాం ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి అదనపు డీసీపీ శ్రీనివాస్ రావుతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఏ సమస్యలు లేకుండా చూసేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావుకు సూచించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. భక్తులకు ఏ ఇబ్బంది కలుగకుండా చూడాలని, అందరూ సహకరించాలని సూచించారు.

తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలి

ప్రజాపాలన అర్జీల డేటాఎంట్రీపై శిక్షణ: గరీమా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ఏవిధమైన తప్పులు లేకుండా, జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆపరేటర్లను ఆదేశించారు. ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీపై ఆపరేటర్లకు శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించనున్న గ్యారంటీల పథకాలపై స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. దానికి గ్రామానికి ఒక్కొక్కరు, మున్సిపల్ వార్డుకు ఒకరు చొప్పున జిల్లాలో మొత్తం 552 మంది ఆపరేటర్లు, 26 మంది మాస్టర్ ట్రైనర్లు పనిచేయనున్నారన్నారు. ప్రజాపాలన కార్యక్రమం 6వ తేదీన ముగుస్తున్నందున మండలాల్లో ఎంపీడీఓ, తహసీల్దార్లు ఆయా ఆపరేటర్లను గ్రామానికి ఒకరుగా ఎంపిక చేసి, కావాల్సిన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్‌నెట్ లాంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ప్రతీ డేటాఎంట్రీ కలెక్టర్ లాగిన్‌లో ఉంటుందని గమనించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, ఏఓ రెహమన్, డీఎల్పీఓలు, ఎంపీవీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ఫుడ్‌ప్రొడక్స్ తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు భవిష్యత్‌లో మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ మహిళలకు సూచించారు. శుక్రవారం ఇర్కోడ్ గ్రామంలోని స్లాటర్ హౌస్‌లో మహిళా సమాఖ్య ఫుడ్‌ప్రొడక్స్ సంఘం పలువురు మహిళలకు నాన్‌వెజ్ వంటకాలపై అందించనున్న 6 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన చికెన్, మటన్ పచ్చళ్ల తయారీ విధానాలను చూసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు ఫుడ్‌ప్రొడక్స్‌లో అనేక రకాల మెలకువలను పొంది మంచి నాణ్యమైన, రుచికరమైన ఉత్పత్తులను తయారు చేసి ప్రజల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య, అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్, ఎంపీడీఓ కుమారస్వామి, డీపీఎం కర్ణాకర్, డీపీఎం వాసుదేవ్, డీపీఎం ఐబీ సాగర్, ఏపీఎం విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే టీపీటీఎఫ్ ధ్యేయం



డైరీని ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీపీటీఎఫ్ ముందుకు సాగుతోందని రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జోన్ కన్వీనర్ నరేందర్, కోకన్వీనర్ విద్యాసాగర్ పేర్కొన్నారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం 2024 సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయడంతో పాటు 1వ తేదీన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, యాదయ్య, శేషాచారి, సత్తయ్య, రాజయ్య, శ్రీనివాస్, మల్లయ్య, వరప్రసాద్, కృష్ణ, భాస్కర్, శ్రీనివాస్, మెట్టయ్య, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



వినతి పత్రాన్ని అందిస్తున్న శంకర్ తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలుచేసి దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. చట్టం అమలులో పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సీఎం అధ్యక్షతన హై పవర్ కమిటీ వేసి దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను సమీక్షించి నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రతి నెలా చివరి రోజున పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి కుల వివక్షను రూపుమాపాలని కోరారు.

మల్చింగ్ విధానం ఉపయోగకరం

జహీరాబాద్: మల్చింగ్ విధానంలో ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలని ఉద్యానవన అధికారి శైలజ అన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆమె శుక్రవారం మండలంలోని రంజోల్ గ్రామాన్ని సందర్శించారు. కూరగాయలు, పూల తోటలను పరిశీలించారు. యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. మల్చింగ్ షీట్ ఉపయోగించి పంటలను సాగు చేసుకోవడం వల్ల కలుపు మొక్కల నివారణ చేయడమే కాకుండా క్రిమి కీటకాల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు.

హుండీ ఆదాయం రూ.3,09,441

చేర్యాల(సిద్దిపేట): శ్రీఉమా పార్థివ కోటి లింగేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.3,09,441 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 105 రోజులుగా భక్తులు సమర్పించుకున్న హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించినట్లు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శివరాజు, ఈవో రవికుమార్ తదితరులు తెలిపారు.

మాదిగలకు సముచిత స్థానం కల్పించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

గజ్వేల్‌రూరల్: పాలక పదవుల్లో మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ డిమాండ్ చేశారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల హరితారెస్టారెంట్ వద్ద జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణమాదిగ అధ్యక్షతన శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగల శ్రమను, త్యాగాలను ఉపయోగించుకున్న కేసీఆర్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదవుల నియామకాల్లో అవకాశం కల్పించలేదని వాపోయారు. తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మైస రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మని మహేశ్, జిల్లా ప్రచార కార్యదర్శి కర్ణాకర్, నాయకులు పొట్ట కర్ణాకర్, రాజు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం.. ఎప్పుడు మోక్షం..

సాగుకు అందని పరికరాలు

- 2వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్
- బడ్జెట్ పెరిగితేనే పరిష్కారం
- నిరాశ చెందుతున్న రైతులు



గజ్వేల్ ప్రాంతంలో డ్రిప్ ద్వారా కూరగాయల సాగు

గజ్వేల్: జిల్లాలో 'సూక్ష్మనీటి సేద్యపు పథకం' అమలు తీరు రైతుల్లో నిరాశను నింపుతోంది. పథకానికి రైతులు అందిస్తున్న దరఖాస్తులకు, ప్రభుత్వం విడుదల చేస్తున్న బడ్జెట్‌కు పొంతన లేకుండా పోతోంది. ఫలితంగా ఏళ్ల తరబడి వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. విస్తారమైన కూరగాయల సాగుతో 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించిన సిద్దిపేట జిల్లాలో కొన్నేళ్లుగా ఈ పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు.

పెండింగ్‌లో దరఖాస్తులు

కూరగాయలు, పళ్లు సాగుచేస్తున్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొన్నేళ్లుగా సూక్ష్మనీటి సేద్యపు పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తుండగా.. 5 ఎకరాలలోపు భూమి ఉన్న సాధారణ రైతులకు 90శాతం, ఆపైన భూమి ఉన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై సూక్ష్మనీటి పథకం కింద బిందు(డ్రిప్) తుంపర పరికరాలు(స్ప్రింకర్‌లు) అందిస్తున్నారు. కాని ప్రభుత్వం సరిపడినంతగా బడ్జెట్ కేటాయించక పోవడం వల్ల కొన్నేళ్లుగా దరఖాస్తులకు మోక్షం కలగడంలేదు. ప్రస్తుతం జిల్లాలో సుమారుగా రెండు వేలకుపైగా దరఖాస్తులు పేరుకుపోయాయి. 20 వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్లు అమర్చుకోడానికి రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ దరఖాస్తులు గత నాలుగేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించాలంటే సుమారుగా రూ.20 కోట్ల వరకు బడ్జెట్ అవసరముంటుందని అంచనా. కాని బడ్జెట్ విడుదలవుతుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆయిల్‌ఫామ్‌కే ప్రాధాన్యత

జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుచేసే రైతులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చి వారికే పరికరాలు పంపిణీ చేస్తున్నారు. గడిచిన మూడేళ్ల నుంచి ఇప్పటి వరకు 10,500 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగులోకి వచ్చింది. రైతులకు ఈ పంట లాభదాయకంగా మారటం వల్ల ఈ తోటలకే ప్రస్తుతం పరికరాలు అందిస్తున్నారు. ఈ తోటలకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించడానికి కూడా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో మరో 10వేల ఎకరాలకుపైగా సాగు పెంచాలనే లక్ష్యంగా ఉద్యానవనశాఖ ముందుకుసాగుతోంది. రైతుల నుంచి ఈ సాగు పట్ల మక్కువ పెరుగుతుండటం వల్ల డ్రిప్ పరికరాలను ఈ తోటలకు పరిమితం చేశారు. దీనివల్ల కూరగాయల రైతులకు పరికరాలు అందటం లేదు. ఆయిల్‌ఫామ్ సాగు తర్వాత రెండో ప్రాధాన్యతగా కూరగాయలు, పళ్ల తోటల సాగుకు పరికరాలను అందించాలని మొదట భావించారు. కానీ ఇది అమలుకు నోచుకోవడం లేదు.

విస్తారంగా కూరగాయల సాగు..

జిల్లాలో కూరగాయల సాగు విస్తారంగా సాగుతోంది. ములుగు మండలం వంటిమామిడిలో కూరగాయల కోసం ప్రత్యేకంగా మార్కెట్ యార్డు ఉండటం, అంతేకాకుండా జిల్లాలో వివిధ మల్టీ నేషనల్ కంపెనీల వెజిటబుల్ కలెక్షన్ సెంటర్లు భారీగా వెలవడమే ఇందుకు నిదర్శనం. ఇదిలావుంటే పల్ల తోటలకు ఉపాధి హామీ కింద 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు పరికరాలు అందించాలనే పథకం ఉన్నా.. ఆశించిన స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం హయాంలో ఉద్యాన పంటలైన పళ్లు, కూరగాయలు తదితరాలకు ప్రోత్సాహం పెరుగుతోందని రైతులు ఎదురుచూస్తున్నారు. దీని వల్ల ఈ తోటల సాగులో కీలకమైన బిందు, తుంపర సేద్యం పరికరాల బడ్జెట్ పెరగవచ్చని భావిస్తున్నారు. దీంతో ఉద్యాన రైతులు ఆశావాహ దృక్పథంతో ఉన్నారు.

పెండింగ్‌లో దరఖాస్తులు

జిల్లాలో కూరగాయల సాగుకు సంబంధించి సూక్ష్మసేద్యపు నీటి పథకం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూస్తాం.

– సునీత, జిల్లా ఉద్యానవనశాఖ అధికారిణి

ఆగస్టీన్ పర్వతా రోహణ కళాశాలకే గర్వకారణం

కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్



ఆగస్టీన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆగస్టీన్ కళాశాలకే గర్వకారణం అని ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రశంసించారు. ఆగస్టీన్ డిసెంబర్ 23 నుండి జనవరి 1వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొన్నాడు. హిమాలయాల్లోని 2875 మీటర్ల ఎత్తుగల ట్రియండి పర్వతాన్ని అధిరోహించాడు. శుక్రవారం ఈ మేరకు కళాశాలలో అధ్యాపకులు ఆగస్టీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కృష్ణయ్య, డాక్టర్ శ్రీనివాస్, మధుసూదన్, డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ పల్లవి, డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

మిత్తి మీరుతున్నారు.. లాభాల పుదీన

జిల్లాలో జోరుగా వడ్డీ వ్యాపారం

- సామాన్యుల నడ్డి విరుస్తున్న వ్యాపారులు
- అధిక వడ్డీకి అప్పులు ఇచ్చి వసూలు
- రైతులు, చిరు వ్యాపారులే టార్గెట్
- నిఘా పెట్టని అధికారులు



జిల్లాలో వడ్డీ వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎదుటి వారి అవసరాలు, పేద ప్రజల కష్టాలు ఆసరాగా చేసుకొని రెచ్చిపోతున్నారు. చిన్న చిన్న హోటళ్ల యజమానులు, కూరగాయల వ్యాపారులు, ఆటోవాలాలు, మెకానిక్‌లు, బీడీ కార్మికులు ఇలా చాలా మందికి పని నిమిత్తం డబ్బు అవసరం పడుతుంది. ఇలాంటి వారిని ఆసరాగా చేసుకొని వడ్డీ వ్యాపారులు దందా చేస్తున్నారు. - హత్నూర (సంగారెడ్డి)

జిల్లాలో వడ్డీ వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయలన్నట్లుగా సాగుతోంది. రైతులు, చిరు వ్యాపారుల అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి వారిని కుదేలు చేస్తున్నారు. ఇప్పుడే వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు సాగు పెట్టుబడి కోసం, విద్యార్థుల చదువుల కోసం తల్లిదండ్రులు గ్రామాల్లోని ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ఇష్టారాజ్యంగా వడ్డీలు వేస్తూ సామాన్యుల కష్టాన్ని దోచేస్తున్నారు. జిల్లాలోని హత్నూర, దౌల్తాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్ పట్టణాల తోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అధికారుల అనుమతుల్లేని ఫైనాన్స్‌లు చాలానే ఉన్నాయి.

అవసరమే ఆసరాగా..

ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడుల కోసం అల్లాడిపోతున్నారు. సకాలంలో పంట రుణాలు అందడం లేదు. రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమకాకపోవడం, రైతుబంధు సమయానికి రాకపోవడంతో రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నారు. దిక్కులేని పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు రైతులకు అప్పు ఇచ్చి వందకు రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. అత్యవసరం కాబట్టి రైతులు తీసుకుంటున్నారు. కొందరు రైతులు భూమి పత్రాలను కుదువపెట్టి అప్పులు తీసుకుంటున్నారు. చిరు వ్యాపారులు అయితే తమ వద్ద ఉన్న బంగారు ఆభరణాలను వడ్డీ వ్యాపారుల వద్ద పెట్టి అధిక వడ్డీలకు అప్పు తీసుకుంటున్నారు.

వడ్డీ ముందే కట్..

వడ్డీ వ్యాపారులు అప్పు ఇచ్చేటప్పుడు ముందుగానే మిత్తి కట్ చేసుకొని మిగితా డబ్బులు ఇస్తున్నారు. వీటిని రోజువారీగా వసూలు చేస్తుంటారు. ఈ క్రమంలో అప్పులు తీసుకున్న వారి నుంచి ఇరవై శాతం ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలూ వినిపిస్తున్నాయి. చేసిన కష్టం మిత్తీలకే సరిపోతుందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అనుమతుల్లేని ఫైనాన్స్ వడ్డీ వ్యాపారులపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కొద్దిపాటి స్థలం, నీటి వసతి ఉంటే చాలు
- సాగు మెలకువలు పాటించాలి
- రైతులకు వ్యవసాయ అధికారి సూచనలు, సలహాలు



మిరుదొడ్డి(దుబ్బాక): కొద్దిపాటి స్థలం, నీటి వసతి కలిగి ఉంటే చాలు పుదీన సాగు రైతులకు లాభసాటిగా మారుతుంది. వ్యవసాయ పొలాల్లో తడిగా ఉండే ప్రాంతాల్లోనే కాకుండా ఇంటి పేరట్లో సైతం పుదీనాను పండించుకోవచ్చు. పుదీన ద్వారా అత్తర్లు, సుగంధ ద్రవ్యాలు, పాన్ మసాలల్లో విరివిగా వినియోగిస్తుంటారు. దగ్గు, జలుబు, ఒంటి నొప్పులను తగ్గించడానికి ఔషధం లాగానే కాకుండా తైలం, టూత్‌పేస్టులు, మౌత్ వాష్‌లతో కూడా పుదీనను ఉపయోగిస్తారు. ఎలాంటి శ్రమ, ఖర్చు లేకుండా వ్యవసాయ పొలాల్లో పుదీనను సాగు చేస్తూ మంచి ఆర్థిక వనరుగా మల్చుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచించారు. పుదీన సాగుపై సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

నేలలు :

నల్ల నేలలు, ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయి. అతిగా చలి, మంచు ఉండే ప్రాంతాల్లో సాగుకు అనుకూలించదు. ఇందులో చాలా రకాలు ఉంటాయి. జపాన్ పుదీన, సక్షమ్, హిమాలయ, శివాలిక్, కోసి అను రకాలు ఉన్నాయి.

మూడు క్వింటాళ్ల :

పుదీన వేర్ల ద్వారా గానీ, కాండపు మొక్కల ద్వారా సాగు చేస్తారు. ఒక ఎకరానికి సుమారు మూడు క్వింటాళ్ల పుదీన తీగ ముక్కలు అవసర పడతాయి.

నాటుకునే విధానం:

తీగ మొక్కలను తగినంత తడి ఉన్న పొలంలో 45 సెంటీ మీటర్ల దూరంలో తీగ మొక్కలు కొద్దిగా పైకి కనిపించేలా నాటి మట్టిని కప్పుకోవాలి. అనంతరం పుదీన తీగ మొక్కలు కొత్త చిగుళ్లు తొడుగుతాయి.


మల్లేశం, వ్యవసాయ అధికారి, మిరుదొడ్డి

ఎరువులు వేసుకునే విధానం:

ఎకరం పొలంలో మెత్తగా దున్ని 5 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ వేసుకోవాలి. నత్రజనిని ఆఖరి దుక్కిలో 40 రోజులకు, 80–90 రోజుల్లో మూడు దఫాలుగా వేసుకోవాలి.

నీరు అందించే విధానం :

పదిరోజులకు ఒక మారు నీటి తడిని అందించాలి. పంట కాలంలో కనీసం 15 సార్లు నీటి తడిని అందిచేలా చూడాలి.

పంట కోత సమయం:

నాటిన 120 రోజుల వరకు మొదటి కోత వస్తుంది. అనంతరం 60 నుంచి 70 రోజుల్లో మరోసారి కోతకు వస్తుంది. కోసిన పుదీనను సుమారు నాలుగు గంటల వరకు నీడలోనే ఆరబెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల పుదీన నాణ్యత కాస్త మెరుగుపడుతుంది. పంట కాలంలో ఎకరానికి 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పుదీనను సాగు చేసే రైతులు మార్కెటింగ్‌లో మంచి మెలకువలు అవలంభిస్తే ఆర్థిక వనరుగా మార్చుకోవచ్చు.

క్లుప్తంగా

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


ఆదర్శ పాఠశాల విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉదయ్‌కిరణ్, అక్షయ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకన్న, పీడీ ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేర్కొన్నారు. ఈ నెల 9 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

భుజిరంపేట విద్యార్థిని ఎంపిక

కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని భుజిరంపేట విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ మహిపాల్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడలలో రాష్ట్ర స్థాయి అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని జి.వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని సర్పంచ్ వనజ శ్యాంసుందర్ రావు, ఎంపీటీసీ సత్తయ్య, హెచ్‌ఎం మహాపుజొద్దీన్, నాయకులు లింగం, కాంతారావు, నాయికోటి రాజు, తదితరులు అభినందించారు.


వైష్ణవి

మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి పాలక మండలి పదవీకాలం గత సెప్టెంబర్‌నే ముగిసింది. వెంటనే దేవాదాయశాఖ అధికారులు పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉండగా, అసెంబ్లీ ఎన్నిల నేపథ్యంలో ఆలస్యం అయ్యింది. స్వామివారి కల్యాణం, బ్రహ్మోత్సవాలు ఉండడంతో పునరుద్ధరణ కమిటీని 20 మంది ధర్మకర్తలను నియమిస్తూ శుక్రవారం దేవాదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా పర్పాటకం లక్ష్మారెడ్డి, కొమ్మురాజేశ్వరి, అంబాల ఉమారాణి, అల్లం శ్రీనివాస్, పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, బోయిని సాయికుమార్, లింగంపల్లి శ్రీనివాస్, ముస్త్యాల దమోదర్, ఎర్రబచ్చలి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, చిరుముల్ల నర్సింహులు, చీపురు భిక్షపతి, కాయిత మోహన్‌రెడ్డి, గడ్డం వీరభద్రప్ప, పత్య శ్రీనివాస్, తాళ్లపల్లి రమేశ్, కామిడి రమణారెడ్డి, చిపిరి కిరణ్ కుమార్ యాదవ్, బండారు మధుసూదన్, కె.అంజయ్య యాదవ్ నియామకం అయ్యారు. ఈ సభ్యులు నాలుగు నెలలపాటు పదవిలో కొనసాగనున్నారు. ఇందులో పర్పాటకం లక్ష్మారెడ్డిని పునరుద్ధరణ కమిటీకి చైర్మన్‌గా నియమించనున్నట్లు సమాచారం.


పర్పాటకం లక్ష్మారెడ్డి

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

ఒక్కొక్కరికి రూ.10 వేలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఏడుగురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం, గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

అదృశ్యమై.. ఆస్పత్రిలో మృతదేహమై..

- గత నెల 22న ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం
- రెండు రోజుల తర్వాత చెరువు కట్టపై తీవ్రగాయాలతో..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- అదృశ్యం కేసు.. హత్యకేసుగా మార్చిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన వ్యక్తి.. కొద్ది రోజుల తర్వాత పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో తీవ్ర గాయాలతో చేరి చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా శుక్రవారం పోలీసులు గుర్తించారు. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసు రెడ్డి, పటాన్‌చెరు సీఐ లాలు నాయక్, మృతుడి కుటుంబ సభ్యులు కథనం మేరకు.. అమీన్‌పూర్ మండల పరిధిలోని బీరంగూడ మల్లారెడ్డి కాలనీకి చెందిన నాగేశ్వరరావు (47) డిసెంబర్ 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు భార్య పద్మ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదృశ్యం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నాగేశ్వర్‌రావు ఫోన్ ట్రేస్ చేయగా నాగపూర్‌లో లొకేషన్ గుర్తించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో పక్క నాగేశ్వరరావుపై అదే రోజు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి పటాన్‌చెరు సాకి చెరువు కట్టపై పడేశారు. కొనప్రాణంతో ఉన్న అతడిని స్థానికులు 23వ తేదీన పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ జనవరి 2వ తేదీన మృతి చెందాడు. అయితే, మృతి చెందిన వ్యక్తి ఎవరనే దానిపై పోలీసులు ఆరా తీస్తుండగా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన నాగేశ్వరరావుగా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై నాగేశ్వరరావు కూతురు మాట్లాడుతూ.. 20 రోజుల క్రితం లారీ డ్రైవర్‌తో డీజిల్ విషయంలో తన తండ్రికి గొడవ జరిగిందని, అతడిపై అనుమానం ఉందని చెప్పింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నాగేశ్వరరావు (ఫైల్)

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో మోసం

- సైబర్ వలలో చిక్కిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- రూ.15 లక్షల 18 వేలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైమ్ జాబ్ పేరుతో సైబర్ నేరగాడి వలలో చిక్కుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భారీ మొత్తంలో డబ్బు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని వెంకట రమణ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ డిసెంబర్ 20వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేయగా, ఒక వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేయడం మొదలు పెట్టాడు. తాను పెట్టిన నగదును, కమీషన్‌ను వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు.



ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. 15 లక్షల 18 వేలు చెల్లించాడు. చివరిగా ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమిషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీఎల్‌జీప రాష్ట్ర కార్యదర్శిగా నర్సింహారెడ్డి


నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీఎల్‌జీఏ) రాష్ట్ర కార్యదర్శిగా నారాయణఖేడ్‌కు చెందిన అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజనీతిశాస్త్రం అధ్యాపకుడు సీ.నర్సింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం, ఉత్తీర్ణత శాతం పెంచడం, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సన్మానం

అల్లాదుర్గం(మెదక్): టీజీఎల్‌ఏ రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికైన నర్సింహారెడ్డిని శుక్రవారం పలువురు సన్మానించారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కనుక చంద్రం, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్దారెడ్డి, కోశాధికారి పవన్ కుమార్, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్యామ్ రావు, అధ్యాపకులు రవికుమార్, రవీందర్, శివ కుమార్, నర్సింలు, ప్రవీణ్ కుమార్, జ్యోతి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడల్లోని పలు పరిశ్రమల్లో శుక్రవారం డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. ఓ పరిశ్రమలో నిధిషేత డ్రగ్స్‌ను ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిసింది. పరిశ్రమల్లో తనిఖీలు, డ్రగ్స్ తదితర వివరాలను అధికారులు వెల్లడించలేదు. పరిశ్రమల ప్రతినిధులు సమాచారం బయటకు రాకుండా చూస్తున్నట్లు తెలిసింది.

వాటర్ ఆటో ఢీకొని బాలుడు మృతి

చేగుంట(తూప్రాన్): ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని మినరల్ వాటర్ తీసుకొస్తున్న ఆటో ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన వడియారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్సై హరీశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వడియారం గ్రామానికి చెందిన రైల్వే గ్యాంగ్ మెన్ పెద్దలచ్చు రమేశ్, సువర్ణ దంపతుల రెండో కుమారుడు శ్రీధర్ (16నెలలు) ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఇదే సమయంలో మినరల్ వాటర్ తీసుకొచ్చిన ఆటో డ్రైవర్ నర్సింహులు బాలుడిని గమనించలేదు. అలాగే వెళ్లడంతో బాలుడు ఆటో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర గాయాలైౖ బాలుడిని తూప్రాన్ ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.


బాలుడు మృతదేహం

అత్తింటి వేధింపులు తాళలేక..

- వివాహిత ఆత్మహత్య
- నలుగురిపై కేసు నమోదు

పటాన్‌చెరుటౌన్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, బీడీఎల్ ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా మర్పనూరు మండలం శ్రీరాంపూర్ కాలనీకి చెందిన వీరయ్య (సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి)కూతురు లావణ్య(23)ను మందమర్రికి చెందిన అర్ష తిరుపతితో 2018 వివాహం చేశారు. పెళ్లై ఏడాది వరకు బాగున్నారు. వీరికి బాబు (అయాన్ శ్రీ) ఉన్నాడు. పెళ్లి సమయంలో ఇస్తానన్న కట్నంలో మిగిలిన రూ.3 లక్షలు తీసుకురావాలని భర్త తిరుపతితో పాటు అత్త, మామ, ఇద్దరు ఆడపడుచులు వేధించసాగారు. ఈ క్రమంలో వీరయ్య సింగరేణిలో రిటైర్‌మెంట్ తీసుకొని రూ.3 లక్షలు అల్లుడికి ఇచ్చాడు.

బర్త్‌డేకి వెళ్లొద్దని..

తిరుపతి గతేడాది నుంచి పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామ సమీపంలోని ఐచర్ పరిశ్రమలో పనిచేస్తూ భార్యతో కలిసి జీవిస్తున్నాడు. ఈనెల 5వ తేదీన లావణ్య అన్న కొడుకు పుట్టిన రోజు ఉండడంతో భర్తతో రావాలని లావణ్యని తండ్రి వీరయ్య ఆహ్వానించారు. అయితే, అత్త లక్ష్మి, మామ శంకరయ్య, ఆడపడుచులు రమాదేవి, రాజేశ్వరి బర్త్‌డేకి వెళ్లొద్దని చెప్పారు. భర్త తిరుపతి సైతం వెళ్లొద్దని చెప్పి బాబును తీసుకొని స్వగ్రామం మందమర్రి గ్రామానికి వెళ్లాడు. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న లావణ్య ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం తండ్రి వీరయ్య లావణ్యకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తీయకపోవడంతో, ఇంటి యజమానికి సమాచారం ఇచ్చాడు. అతడు వెళ్లి కిటికీలో నుంచి చూడగా లావణ్య ఉరివేసుకొని కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం వీరయ్య ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త అత్త, మామ, ఇద్దరు ఆడపడుచులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


లావణ్య మృతదేహం

వక్ఫ్‌బోర్డు భూముల ఆక్రమణపై కేసు

గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: వక్ఫ్‌బోర్డు భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర దేవాలయం వెనుక భాగంలో ఓ సర్వే నెంబర్‌లో సుమారు 1,800 గజాల వక్ఫ్‌బోర్డు భూమి ఉందన్నారు. అందులో నుంచి 900 గజాల భూమిని గంగుమల్ల శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి తనకు అమ్మినట్లు పట్టణానికి చెందిన గుంటుకు రాజు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. అక్కడ గుంటుకు రాజు ఫెన్సింగ్ వేస్తుండగా.. ఈ స్థలం వక్ఫ్ బోర్డుకు చెందినదంటూ పలువురు అభ్యంతరం తెలిపారన్నారు. మహ్మద్ అబ్దుల్ వాహిద్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వ భూములు, దేవాలయ, వక్ఫ్‌బోర్డు భూములను ఎవరు కబ్జా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దొంగల బీభత్సం

- హుస్నాబాద్‌లో పట్టపగలే రెండు ఇళ్లలో..
- అల్లాదుర్గంలో ఎనిమిది ఇళ్లలో చోరీలు
- సీసీ ఫుటేజీలో దొంగ ఆనవాళ్లు

రెండు వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం దొంగలు బీభత్సం సృష్టించారు. హుస్నాబాద్‌లో పట్టపగలే రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. అలాగే, అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో ఏకంగా ఎనిమిది ఇళ్లలో చొరబడి బంగారం, నగదు అపహరించుకుపోయారు.


బీరువాను పరిశీలిస్తున్న సీఐ కిరణ్, ఎస్సై మహేశ్


పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్: పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావూస్ కాలనీలో ఆటో మొబైల్ షాపు యాజమాని పెద్ది రవీందర్, ఆయన భార్య ఇద్దరూ వ్యాపార రీత్యా ఉదయం ఇంటికి తాళం వేసి షాపునకు వెళ్లారు. మధ్యాహ్నం 12.45 నిమిషాల ప్రాంతంలో టిఫిన్ తీసుకెళ్లేందుకు రవీందర్ ఇంటికొచ్చాడు. తలుపు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని ఐదు తులాల బంగారు ఆభరణాలు, మరో చోట పెట్టిన రూ.50 వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.

గంట వ్యవధిలోనే మరో ఇంట్లో..

రావూస్ కాలనీలో చోరీ జరిగిన గంట వ్యవధిలోనే రెడ్డి కాలనీలో తాళం వేసి ఉన్న మరో ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాయిత విశాల్ ఇంటి తాళాలు పగులగొట్టి 2 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కిరణ్, ఎస్సై మహేశ్ సిబ్బందితో కలిసి చోరీ జరిగిన రెండు ఇళ్లను పరిశీలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిరణ్ తెలిపారు. రెండు ఇళ్లలో ఒక్కడే దొంగతనానికి పాల్పడి ఉంటాడని పోలీస్‌లు ప్రాథమికంగా నిర్ధారించారు. త్వరలోనే దొంగను పట్టుకుంటామని తెలిపారు.

ఒక్క రోజే ఎనిమిది ఇళ్లలో చోరీ

అల్లాదుర్గం(మెదక్): ఒకే గ్రామంలో ఏకంగా ఎనిమిది ఇళ్లలో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయకుని రామకిష్టయ్య తన కూతురిని చూసేందుకు ఇంటికి తాళం వేసి పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లాడు. దోపిడీ దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి అందులోని తులన్నర బంగారు ఆభరణాలు, రూ.10 వేలు ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామంలోని మరో ఇంటి తాళం పగులగొట్టి రూ.20 వేలు, అలాగే బండారు మార్త ఇంటిలోని బంగారు నగలు, వెండిని ఎత్తుకెళ్లారు. అలాగే కునదొడ్డి ప్రమీల పక్క గదిలో నిద్రిస్తుండగా దొంగలు చొరబడి వస్తువులు, నగదును చోరీ చేశారు. కుంట్ల భాస్కర్, కోట లక్ష్మణ్ ఇద్దరూ హైదరాబాద్‌లో ఉండగా ఇంటి తాళాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. గొల్ల మహేశ్, బీరప్ప ఇళ్ల తాళాలు ధ్వంసం చేశారని, మొత్తంగా ఎనిమిది ఇళ్లలో చోరీ జరిగిందని పేర్కొన్నారు. చోరీలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సీసీ ఫుటేజీలో బ్యాగ్‌తో వెళ్తున్న దొంగ ఆనవాళ్లు

చిట్టీ డబ్బులు కట్టి వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: గూడ్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన పైండ్ల జైపాల్‌రెడ్డి (50) 8 నెలలుగా బుస్సాపూర్ శివారులో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. 3వ తేదీన చిట్టీడబ్బులను ఇచ్చేందుకు స్వగ్రామమైన దామెరకు వెళ్లాడు. పనులు ముగించుకొని బైక్‌పై శుక్రవారం ఉదయం పొలం వద్దకు వస్తుండగా సిద్దిపేట నుంచి బుస్సాపూర్ వెళ్తున్న క్రమంలో ఇర్కోడ్ శివారులో గల సబ్‌స్టేషన్ దగ్గరకు రాగానే మినీ గూడ్స్ వ్యాన్ బలంగా ఢీకొట్టింది. జైపాల్‌రెడ్డి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు.


రక్తపు మడుగులో జైపాల్‌రెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ శివారులో జాతీయ రహదారి 44 పక్కన మైసమ్మ దేవాలయం దగ్గరలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మృతదేహానికి పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి సమాచారం తెలిస్తే మనోహరాబాద్ పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ కోరారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం